మండుటెండలో మహాలక్ష్మిలు

- ఏండ్లు గడుస్తున్నా ఏర్పాటు కాని బస్‌షెల్టర్లు
- ప్రయాణికుల పాట్లు
- ఇంకెన్నాళ్లో ఈ అవస్థలు



హయత్‌నగర్‌లో ఎర్రటి ఎండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

హయత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో ఆలోచించే జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల పాట్లపై దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసుల కమిటీలో సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారింది. నగరంతో పాటు విజయవాడ జాతీయ రహదారి ఎల్బీనగర్ మొదలుకుని బాటసింగారం వరకు రోడ్డుకు ఇరువైపులా అనేక ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు బస్సుల కోసం ఎర్రటి ఎండలో నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా కొత్తగా బస్‌షెల్టర్లు నిర్మించకపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రయాణికులు బస్టాండ్ సమీపంలో ఉన్న వ్యాపార సముదాయాల వద్ద నీడకు తలదాచుకుంటున్నారు. బస్సుల రాక కోసం గంటల తరబడి ఎండలో నిలబడి అనారోగ్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం ప్రతి సంవత్సరం బస్ షెల్టర్ల నిర్మాణం కోసం కమిటీకి ప్రతిపాదనలు పంపాం అంటున్నారే కానీ అవి కార్యరూపం దాల్చడం లేదు. అధికారుల అలసత్వం మూలంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు, ఇంజనీరింగ్ విద్యార్థులు బస్సులపై ఆధారపడి ప్రయాణం చేసే ప్రయాణికులందరు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండుటెండలో మహాలక్ష్మిలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి పథకం) ఉపయోగించుకునే మహిళలు బస్సు షెల్టర్లు లేక ఎండలో నిలబడి బస్సుల కోసం వేచి చూసి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించినప్పటికీ అధికారులు మాత్రం నీడ కోసం బస్సు షెల్టర్లు నిర్మించడం లేదు. ఇటీవల ఎల్బీనగర్ మొదలుకుని బాటసింగారం వరకు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అక్కడక్కడ ఉన్న బస్సు షెల్టర్లు మొత్తం కూల్చివేశారు. దీంతో దాదాపు 20 నుంచి 40 స్టాపుల్లో ప్రయాణికులు ఎండలోనే నిలబడుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులు బస్సు షెల్టర్ లేని చోట ప్రయాణికుల నీడ కోసం తాత్కాలిక షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం అవి కూడా నిర్మించకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు. అవసరం అయిన చోట బస్సు షెల్టర్లు నిర్మించేందుకు కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీ నివేదిక అందగానే బస్సు షెల్టర్లు నిర్మిస్తామని ఐదు సంవత్సరాలుగా అధికారులు చెబుతున్నారు. కానీ ఇంత వరకు అవి కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల బాధలు పట్టించుకోవాలి



మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎర్రటి ఎండలో నిలబడి ప్రయాణం చేస్తున్న మహిళల సమస్యను పట్టించుకోవాలి. ఎల్బీనగర్ మొదలుకుని చౌటుప్పల్ వరకు విజయవాడ జాతీయ రహదారిపైన బస్సు షెల్టర్లు నిర్మించాలి. జాతీయ రహదారి విస్తరణలో బస్సు షెల్టర్లను పూర్తిగా కూల్చివేశారు. పేద మహిళలు, ఇతర ప్రయాణికులు ఎర్రటి ఎండలో బస్సుల కోసం వేచి ఉండడం వల్ల వారి ఆరోగ్యం చెడిపోతుంది. వడ దెబ్బ తగిలి ఆస్పత్రి పాలు అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీడ కోసం బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

- జక్కిడి జయేందర్‌రెడ్డి, హయత్‌నగర్

బస్సు షెల్టర్ల నిర్మాణం కోసం సర్వే చేశాం..

బస్సు షెల్టర్లు లేని చోట నిర్మించేందుకు రెండు నెలల క్రితం జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీస్ డిపార్టుమెంట్‌తో కూడిన కమిటీ సర్వే చేయడం జరిగింది. ఎక్కడెక్కడ బస్సు షెల్టర్లు అవసరం ఉన్నాయో కమిటీ గుర్తించి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించారు. మంజూరు కాగానే నిర్మిస్తాం.

- మాధవి, డివిజినల్ మేనేజర్ హయత్‌నగర్



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యాదిరెడ్డి తదితరులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 21, 22 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభల పోస్టర్‌ను బుధవారం కుంట్లూర్ ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ ఫేజ్-3లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డితో కలిసి యాదిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు తీరడం లేదన్నారు. కార్మికులందరు సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 10కోట్ల మంది నిర్మాణ రంగంలో పని చేస్తున్నారని తెలిపారు. 60ఏళ్ల దాటిన కార్మికులందరికీ పింఛన్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, కార్యదర్శి వెంకన్న, నర్సింహ, రవి, రాములు, నిరంజన్, బిచ్చునాయక్ పాల్గొన్నారు.



తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కుమ్మరి వాగును రక్షించండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్-లష్కర్‌గూడ గ్రామ సరిహద్దులోని కుమ్మరివాగును రక్షించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏర్పుల నర్సింహ బుధవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ కుమ్మరివాగు ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గోడను నిర్మిస్తున్నారని తెలిపారు. దీంతో కుమ్మరి వాగులోకి వరద నీరు రాకుండా అడ్డుకట్ట వేశారని పేర్కొన్నారు. వాగుకు అడ్డంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలన్నారు. గోడను ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ స్థలాలను ఆక్రమించారని తెలిపారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లింగస్వామి, శివకుమార్, వెంకటేష్, మహేష్, రవి పాల్గొన్నారు.



గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమంలో సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురంలో గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమం

వనస్థలిపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పార్టీ కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్ రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహచారి పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సామూహిక గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

ఘనంగా సామూహిక గణపతి హోమం

చంపాపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో బుధవారం సంకష్టహర చతుర్థినిని పురస్కరించుకొని వినాయకస్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు సామూహిక గణపతి హోమాన్ని ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



డాక్టరేట్ అందుకుంటున్న స్వర్ణలత

స్వర్ణలతకు డాక్టరేట్

సరూర్‌నగర్: బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన 'సహోదరి ఫౌండేషన్ రూరల్ అండ్ అర్బన్ ట్రెయినింగ్ సెంటర్' వ్యవస్థాపకురాలు స్వర్ణలతను.. తమ ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకుగాను వాషింగ్‌టన్‌లోని డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ క్రమంలో ఇటీవల న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్‌చంద్ర బిశ్వాస్, ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ లలిత్‌కుమార్‌సాగర్, ప్రొఫెసర్ పంకజ్‌కుమార్‌సింగ్, బాలీవుడ్ నటుడు రాహుల్‌రాయ్ ఆమెకు డాక్టరేట్‌ను అందజేశారు. 15 సంవత్సరాలుగా ఆమె సహోదరి సంస్థ ద్వారా దాదాపు 5వేల మందికి ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించి, వారు తమ ఇళ్లలోనే దుస్తులు కుట్టుకుంటూ ఉపాధి పొందేలా చేశారు. శిక్షణ పొందిన వారిలో సుమారు రెండు వేల మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నట్టు స్వర్ణలత పేర్కొన్నారు. ఎవరైనా దాతలు కుట్టు మిషన్లు అందజేస్తే వాటిపై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, అనంతరం వారు తమ ఇంటిలోనే దుస్తులు కుడుతూ ఉపాధి పొందగలుగుతున్నారని ఆమె అన్నారు. బాలాపూర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అనేక మంది మహిళలకు ప్రస్తుతం ఉచిత శిక్షణ కేంద్రం కొనసాగుతున్నదని ఆమె పేర్కొన్నారు. తన సేవలకు గుర్తింపుగా వాషింగ్‌టన్ డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తన సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరాటంకంగా కొనసాగిస్తానని పేర్కొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను ప్రోత్సహిస్తాం

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించి ప్రోత్సహిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. బుధవారం హయత్‌నగర్ టీ-నగర్ కాలనీలో నిర్వహించిన ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం పని చేసిన వారికి తగిన ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యులు రాజకీయాల్లో లేరని నాయకులు, కార్యకర్తలే తన రాజకీయ వారసులన్నారు. ఇప్పటి నుంచే బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోగా పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ అక్రమ కేసులను నిరసిస్తూ గురువారం ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, పీసీసీ మాజీ కార్యదర్శులు భాస్కర్‌యాదవ్, ముద్దగోని రామ్మోహన్ గౌడ్, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, కల్లెం సుజాత, కిశోర్‌గౌడ్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి



ప్రియదర్శిని పార్కు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్, దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి పొందేందుకు ప్రియదర్శిని పార్కు సమీపంలో నూతనంగా వంతెన నిర్మించనున్నట్లు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మెయింటెనెన్స్ సీఈ రత్నాకర్‌రావు, ఎస్‌ఎన్‌డీపీ చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఈఈ నారాయణ, ఎస్‌ఎన్‌డీపీ ఈఈ రవిశంకర్, ఎల్బీనగర్ ఉపకమిషనర్ సేవా ఇస్లావత్‌లతో కలిసి రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రూ. 5కోట్ల 96లక్షల అంచనా వ్యయంతో వంతెన పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగకుండా వంతెన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ వంతెన పనులు పూర్తయితే సరూర్‌నగర్ నుంచి సైదాబాద్, పీఅండ్‌టీ కాలనీ, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణించగలుగుతారన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో వ్యాపారాభివృద్ధి జరుగుతుందన్నారు. త్వరలో వంతెన పనులు ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ కార్తీక్, ఎస్‌ఎన్‌డీపీ డీఈ వెంకటకిరణ్, రవిచందర్, నగేష్‌నాయక్, ఇరిగేషన్ ఏఈ సతీష్, కీర్తి, వెటర్నరి అధికారి యాదగిరి, సీపీ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రేమ్‌నాథ్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, రాజు, ఆదర్శ్, మనోజ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మురుగు ప్రవాహం

- రోడ్డు పక్కన వదిలేసిన డ్రైనేజీ పైప్‌లైన్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ ఔట్‌లైన్ సమస్య పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీని పట్టిపీడిస్తుంది. నేటి వరకు ఔట్‌లైన్ సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో ఆయా వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ డ్రైనేజీ మురుగు దర్శనమిస్తుంది. తాజాగా 9వ వార్డు లక్ష్మారెడ్డిపాలెం వద్ద విజయవాడ జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుంది. ఆ వార్డులోని సూర్యవంశీకాలనీకి చెందిన భూగర్భ డ్రైనేజీ పైప్‌లను ఇటీవల పూర్తి చేసి సూర్యవంశీకాలనీ కమాన్ వద్ద జాతీయ రహదారి 65 పక్కన వదిలేశారు. దీంతో రోడ్డు పక్కన మురికికుంట ఏర్పడింది. ఆ కుంట నిండిన తర్వాత మురుగు నీరు జాతీయ రహదారిపై పారుతుంది. దీంతో వాహనదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన పలువురు తెలిపారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



జాతీయ రహదారిపై పారుతున్న మురుగునీరు



లక్ష్మారెడ్డిపాలెం సూర్యవంశీకాలనీ కమాన్ జాతీయ రహదారి పక్కన ఏర్పడిన మురుగుకుంట

కుషాయిగూడలో మూడు నెలల్లో మూడు హత్యలు

- తండ్రులను చంపిన తనయులు
- ఒంటరి మహిళను

అంతమొందించిన మైనర్

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుషాయిగూడలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. వరుసగా మూడు నెలల్లో మూడు హత్యలు జరిగాయి. ఇందులో రెండు హత్యలు తనయులు తండ్రులను చంపారు. ఇందులో నిందితులందరూ 25సంవత్సరాల లోపు వారే. తాజాగా ఓ బాలుడు ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని దారుణంగా హత్య చేశాడు. పై హత్యలన్నింటికీ ప్రధాన కారణం వేధింపులే. సహనం కోల్పోయి విక్షణారహితంగా చేసిన ఈ హత్యలు మానవ సంబంధాలను మంట కలిపాయి. తండ్రి అనే మమకారం లేకుండా కన్న కొడుకులే కాలయములుగా మారి హత్య చేయగా, తాజాగా 15 ఏళ్ల బాలుడు 70 ఏళ్ల వృద్ధురాలిని అతి దారుణంగా హత్య చేశాడు. క్షణికావేశంలో సంబంధాలను మరచిపోయి దురాగతాలకు పాల్పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుని జైలు పాలయ్యారు.



ఈసీఐఎల్‌లో తండ్రిని చంపుతున్న తనయుడు (ఫైల్)

ఈసీఐఎల్‌లో..

ఫిబ్రవరి 22న లాలాపేటకు చెందిన అరెల్లి మొగిలిని అతడి కుమారుడు సాయికుమార్(25) ఈసీఐఎల్‌లో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పట్టపగలు అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై కత్తితో పొడిచిచంపాడు. తండ్రి నిత్యం మద్యం తాగొచ్చి తల్లి, చెల్లిని, తనను వేధిస్తున్నాడనే కోపంతో హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు అంగీకరించాడు.

కుషాయిగూడ సాయినగర్‌లో..

మార్చి 24న రాత్రి కుషాయిగూడ సాయినగర్‌లో పత్లావత్ శంకర్(54)ను ఆయన కుమారుడు జగదీశ్(24) గొంతు నులిపి చంపాడు. తండ్రి మద్యం మత్తులో తల్లిని, తనను నిత్యం వేధిస్తున్నాడని, అందుకే చంపినట్లు జగదీష్ పోలీసుల విచారణలో తెలిపాడు. ప్రస్తుతం ఇద్దరు నిందితుడు జైలులో ఊచలు లెక్కిస్తున్నారు.

హెచ్‌బీకాలనీ కృష్ణానగర్‌లో..

ఈ నెల 14న హెచ్‌బీకాలనీ కృష్ణానగర్‌లో కమలమ్మ(70) అనే ఒంటరి మహిళను బాలుడు(17) దారుణంగా హత్య చేశాడు. వృద్ధురాలి తలపై ఇనుప రాడ్‌తో కొట్టి, చీరతో ఉరేసి చంపాడు. అనంతరం మృతదేహం గొంతుపై కాళ్లతో తొక్కుతూ ఎగిరి గెంతేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన దృశ్యాలు అందరినీ కలిచి వేశాయి. వృద్ధురాలు దుకాణం నిర్వహణలో తనను నిత్యం వేధిస్తుందని ఒంటరిగా ఉన్న ఆమె ఇంట్లోకి ఈ నెల 11న రాత్రి చొరబడి హత్య చేశాడు. సదరు బాలుడుని అదుపులోకి తీసుకుని రెండు రోజుల పాటు విచారించిన పోలీసులు నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. ఇలా వరుస హత్యలు కుషాయిగూడ పోలీసులకు సవాలుగా మారాయి.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి



శంకర్ మృతదేహం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి అపస్మారకస్థితికి చేరి మృతిచెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. చాదర్‌ఘాట్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బల్లారు గ్రామానికి చెందిన శంకర్(46) డ్రైవర్. 25 సంవత్సరాలుగా చాదర్‌ఘాట్‌లోని జీహెచ్‌ఎంసీ సీటీవో కార్యాలయంలో చెత్తను తరలించే వాహనాలను నడుపుతూ అక్కడే ఉండేవాడు. రెండు, మూడు నెలలకోసారి శంకర్ సొంతూరికి వెళ్లి వస్తుండేవాడు. 15రోజులుగా డ్రైవర్ పని చేయకుండా మలక్‌పేట మార్కెట్‌లో పనిచేసి వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ ఇక్కడే నిద్రిస్తున్నాడు. మంగళవారం రాత్రి మలక్‌పేట మార్కెట్‌లో మద్యం సేవించి అపస్మారక స్థితికి చేరాడు. బుధవారం ఉదయం చూసే సరికి మృతి చెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మొదట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా భావించిన పోలీసులు తర్వాత మృతుడి వివరాలను వెలికితీశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఆటోడ్రైవర్‌పై యువకుల దాడి



తీవ్రగాయాలతో ఆటో డ్రైవర్ పవన్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సింగరేణికాలనీలో బీరుబాటిళ్లు తెచ్చివ్వమంటే డబ్బులు లేవని చెప్పిన పాపానికి మద్యంమత్తులో ముగ్గురు యువకులు ఆటోడ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణికాలనీకి చెందిన పవన్(27)వృత్తిరిత్యా ఆటోడ్రైవర్. మంగళవారం అర్ధరాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో మద్యంమత్తులో ఉన్న ముగ్గురు యువకులు వంశీ, అంజి, కిట్టు ఆటోడ్రైవర్ పవన్‌ను అడ్డగించారు. బీర్లు తీసుకురావాలని హెచ్చరించారు. తన వద్ద డబ్బులు లేవని తాను తేలేనని అని చెప్పాడు. దీంతో రెచ్చిపోయిన యువకులు ఆటో డ్రైవర్‌ను చితకబాదారు. ఈ ఘటన ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. ప్రాణభయంతో ఆటోడ్రైవర్ పరుగులు పెడుతూ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్‌పై యువకుల దాడి



దాడిలో గాయపడిన కిరణ్‌కుమార్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో డాక్టర్‌పై యువకులు దాడి చేసిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణికాలనీలో హుమహెల్త్‌కేర్ ఆస్పత్రిలో పని చేస్తున్న నర్సు ప్రవర్తన మార్చుకోమని పలుమార్లు డాక్టర్ కిరణ్‌కుమార్ హెచ్చరించాడు. నర్సు నడవడికలో మార్పురాకపోవడంతో విధుల నుంచి తొలగించాడు. దీంతో బుధవారం నర్సు పలువురు యువకులతో కలిసి డాక్టర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై డాక్టర్ కిరణ్‌కుమార్ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు దాడికి పాల్పడిన యువకులను గుర్తించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో నేడు వాహనాల వేలం

హయత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలకు గురువారం ఉదయం హయత్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ధనవంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు కార్యాలయంలో వేలంపాట జరుగుతుందని తెలిపారు. 1జీపు, 1కారు, 1ఆటో, 2 స్కూటర్లు, 1 మోటర్ సైకిల్‌లను వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 8712658743లో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాలానగర్ : గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని బాలానగర్ పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ అయ్యప్పస్వామి ఆలయానికి సమీపంలో పాడుబడిన ఓ భవనం వద్ద వ్యక్తి మృతదేహం ఉన్నదని స్థానికులు డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాలానగర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి పేరు రాము అని, రోడ్లపై తిరుగుతూ భిక్షాటన చేస్తుంటాడని స్థానికులు చెప్పారని కేసు దర్యాప్తు చేస్తున్న రామ్‌నారాయణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9490617114, 8919338941 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

చైన్ స్నాచింగ్ నాటకమాడి అరెస్టయ్యాడు

హైదర్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): యజమాని దగ్గర సానుభూతి పొందేందుకు ఓ వ్యక్తి చోరీ నాటకమాడి పోలీసులకు చిక్కాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వసంతనగర్ కాలనీలో మెదక్ జిల్లా వల్లూరుకు చెందిన ముక్కెర ఆంజనేయులు(50) భార్య భాగ్యమ్మతో కలిసి నివసిస్తూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం వేకువజామున భార్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా ఆంజనేయులు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని చైన్‌లాక్కుని వెళ్లాడు. తనకు ఏమీ తెలియనట్ల నటించి గుర్తుతెలియని వ్యక్తి చైన్ లాక్కెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అక్కడ ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో ఆంజనేయులను పోలీసులు ప్రశ్నించారు. పనిచేస్తున్న ఇంటి యజమాని బంగారు గొలుసు కొనిచ్చారు. అయితే రూ.30 వేలు అప్పు ఉండటంతో చైన్ దొంగతనంతో యజమాని దగ్గర సానుభూతి వస్తే డబ్బు ఇస్తాడని ఈ నాటకమాడినట్లు ఒప్పుకున్నాడు. గొలుసు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆంజనేయులును రిమాండ్‌కు తరలించారు.